ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 164 | బుధవారం 18, ఫిబ్రవరి 2026 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


# ఆ రెండు పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్

**కాంగ్రెస్, బీజేపీలపై హరీశ్ రావు ఫైర్**
**జెండాలు, అజెండాలు పక్కనపెట్టి**
**దిగజారుడు రాజకీయాలు చేశారని విమర్శ**
**కల్వకుంట్ల కుటుంబాన్ని రేవంత్ కాపాడుతున్నారని విమర్శ**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కాంగ్రెస్, బీజేపీలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం జెండాలు, అజెండాలు పక్కనపెట్టి దిగజారుడు రాజకీయాలు చేశారని విమర్శించారు. బీజేపీకి బీఆర్ఎస్ పార్టీ బీటీమ్ అంటూ కాంగ్రెస్... కాంగ్రెస్ కు బీఆర్ఎస్ బీటీమ్ అంటూ బీజేపీ.... గత 12 ఏళ్లుగా చేసిన ప్రచారమంతా తప్పుడు ప్రచారమేనని తేలిపోయిందని అన్నారు. ఆ రెండు పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్ అని తేలిపోయిందని చెప్పారు.
"మార్పు అంటే బీజేపీతో కలవడమా? ఇదేనా మీరు తెస్తానన్న మార్పు?" అని సీఎం రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో కొట్టుకున్నట్టు నటిస్తూ...

...మిగతా 2లో



# ఇంకెంత కాలం ఈ అవమానాలు?

## నన్ను మానసిక క్షోభకు గురి చేస్తున్నారు..

**తన వర్గానికి చెందిన కౌన్సిలర్లకు ప్రాధాన్యత ఇవ్వలేదని జీవన్ రెడ్డి ఆగ్రహం**
**మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకే కట్టుబడి ఉన్నానన్న జీవన్ రెడ్డి**
**కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కూడా కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక తీరుపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన సమిండ్ల వాణి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. తన వర్గానికి చెందిన కౌన్సిలర్లకు ప్రాధాన్యత ఇవ్వలేదంటూ ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని, అవమానాలను ఇంకా ఎంత కాలం

...మిగతా 2లో

# నాలుగు వారాల్లో లొంగిపోవాలి

**ప్రత్యూష కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పు**
**రెండు దశాబ్దాలుగా సంచలనంగా మారిన కేసు**
**గుడిపల్లి సిద్ధార్థ రెడ్డి అప్పీల్ ను కొట్టేసిన సుప్రీం**
**హైకోర్టు ఖరారు చేసిన శిక్షను సమర్థించిన ధర్మాసనం**
**పోస్టుమార్టం నిర్వహణ తీరుపై సుప్రీం అసంతృప్తి**






# తాను జాతిపితనని కేసీఆర్ ఏనాడూ అనలేదు

**కేసీఆర్‌ది ఏ జాతి, జాతిపిత ఎలా అవుతారని ఇటీవల రేవంత్ రెడ్డి వ్యాఖ్య**
**మాది రాణీ రుద్రమ, సమ్మక్క-సారక్కల జాతి అన్న కేటీఆర్**
**సమైక్యాంధ్ర సంచులు మోసిన వారికి జాతి గురించి ఏం తెలుస్తుందని ప్రశ్న**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి కొంతమంది విమర్శలు గుప్పిస్తున్నారని, ఆయన ఏ జాతికి జాతిపిత అని ఎద్దేవా చేస్తున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమది రాణీ రుద్రమ, సమ్మక్క సారక్క, దొడ్డి కొమురయ్య వంటి తెలంగాణ మహాపురుషుల జాతి అని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేసీఆర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు నిర్వహించారు.
ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, తాము ప్రతిపక్షంలోకి వచ్చాక కేసీఆర్‌ను తూలనాడుతూ కొంతమంది వ్యాఖ్యలు చేస్తున్నారని

...మిగతా 2లో

# సీఎం చంద్రబాబుతో మంత్రి తుమ్మల భేటీ

**ఏపీలో విలీన గ్రామల కోసం విజ్ఞప్తి**
**రెండు రాష్ట్రాల సమస్యలపై చర్చ**
**సరిహద్దుల్లో రోడ్లు తీరుపై సీఎం ఆరా**
**సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే లైన్ల పూర్తికి నిర్ణయం**
**తిరుమలలో తెలంగాణ భక్తలకు 5 ఎకరాలు**
**భూ కేటాయింపునకు మంత్రి వినతి**




# హస్తానికి కలిసొచ్చిన లక్కీ డ్రాలు

**కాంగ్రెస్ ఖాతాలోకి జనగామ, తొర్రూర్**
**ఉద్రిక్త పరిస్థితుల నడుమ ఎన్నికలు**
**గట్టి పోటీ ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ**
**ఇబ్రహీంపట్నం కైవసం చేసుకున్న కారు**
**అత్యధిక స్థానాలు అధికార పార్టీవే**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణలో వాయిదా పడిన పలు మున్సిపాలిటీల్లో మంగళవారం చైర్‌పర్సన్ ఎన్నికల ప్రక్రియ తిరిగి ప్రారంభమైంది. కోరం లేక సోమవారం నిలిచిపోయిన ఎన్నికలు పలు చోట్ల ఉత్కంఠభరితంగా సాగాయి. కొన్ని చోట్ల లక్కీ డ్రా ద్వారా ఫలితాలు రావడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. మహబూబాబాద్ జిల్లాలోని

...మిగతా 6లో

# తెలంగాణలో ప్రొపెల్లంట్ భారీ పెట్టుబడులు



**రూ.1000 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు అంగీకారం**
**రూ.300 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్న ట్రైడెంట్ ఏఐ**
**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి**
**2035 నాటికి 25 బిలియన్ డాలర్లు**
**స్థానికంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు**
**100 ఎకరాల్లో జీనోమ్ వ్యాలీ ఫేజ్–4 విస్తరణ**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నప్పటికీ రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. అమెరికాకు చెందిన ట్రైడెంట్ ఏఐ కంపెనీ రూ.300 కోట్ల పెట్టుబడులకు అంగీకరించిందని, ఆర్ఎక్స్ ప్రొపెల్లంట్ సంస్థ రూ.1000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిందని వెల్లడించారు. అలాగే ఫ్రాజెన్స్ గ్రూప్‌కు చెందిన గ్లోబల్ హెల్త్ కేర్ సంస్థ ఒపెల్లా కూడా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిందన్నారు. హైదరాబాద్‌లోని

...మిగతా 2లో

# ఎప్‌స్టీన్ ఫైల్స్ దుమారం

**ఏఐ సదస్సుకు బిల్‌గేట్స్ దూరం**
**ఢిల్లీలో జరుగుతున్న శిఖరాగ్ర సదస్సు**
**బిల్ గేట్‌స్‌కు ఆహ్వానం రాలేదంటూ చర్చ**
**కథనాల నేపథ్యంలో ప్రభుత్వ పునరాలోచన**
**గేట్స్ ఫౌండేషన్ కీలక వివరణ**




# గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా హైదరాబాద్

**ఏఐ రంగంలో రూ.73,000 కోట్ల పెట్టుబడులు**
**బయో ఏషియా సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి**
**హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా నిర్వహణ**
**ఏఐ, ఫార్మా, బయోటెక్ రంగాల ప్రముఖుల హాజరు**
**నైపుణ్యంతో కూడిన యువశక్తిని రూపొందిస్తమని వెల్లడి**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా బయోఏషియా-2026 సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ, ఫార్మా, బయోటెక్ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరైన ఈ సదస్సులో సీఎం రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వివరించారు. తెలంగాణను ప్రపంచ

...మిగతా 4లో

# సాంకేతికత సామాన్యుడికి ఉపయోగపడాలి

**ఏఐ అంతర్జాతీయ సదస్సులో ప్రధాని మోడీ**
**భారత్ మండపంలో రెండో రోజు ఏఐ సదస్సు**
**ఏఐ ప్రజా సంక్షేమానికి ఉపయోగపడాలన్న మోదీ**
**జీవనోపాధికి తోడ్పడాలని సూచన**
**స్వదేశీ ఏఐ కళ్లద్దాల ఆవిష్కరణ**
**భారత్‌ను ఏఐ హబ్‌గా చేయడమే లక్ష్యమని వెల్లడి**



www.prajaswaramdaily.com WWW.PRAJASWARAMDAILY.COM

# ఆ రెండు పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్

**మొదటిపేజీ తరువాయి**



గల్లీలో చేతులు కలుపుకుని వాటాలు పంచుకుంటున్నారని ఆరోపించారు. సిర్పూర్ కాగజ్ నగర్, మెట్ పల్లి, అమన్ గల్, అలియాబాద్, నర్సాపూర్ ఫలితాలే దీనికి సాక్ష్యమని చెప్పారు.
బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఉన్న బలాన్ని చూసి భయపడే ఈ రెండు పార్టీలు సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి కుట్రలకు తెరలేపాయని, రాబోయే రోజుల్లో ప్రజలే వీళ్లకు బుద్ధి చెబుతారని హరీశ్ రావు గట్టిగా చెప్పుకొచ్చారు.

# సాంకేతికత సామాన్యుడికి ఉపయోగపడాలి

- **ఏఐ అంతర్జాతీయ సదస్సులో ప్రధాని మోడీ**
- **భారత్ మండపంలో రెండో రోజు ఏఐ సదస్సు**
- **ఏఐ ప్రజా సంక్షేమానికి ఉపయోగపడాలన్న మోదీ**
- **జీవనోపాధికి తోడ్పడాలని సూచన**
- **స్వదేశీ ఏఐ కళ్లద్దాల ఆవిష్కరణ**
- **భారత్‌ను ఏఐ హబ్‌గా చేయడమే లక్ష్యమని వెల్లడి**

**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**

దేశ రాజధాని న్యూఢిల్లీలోని భారత్ మండపం వేదికగా జరుగుతున్న అంతర్జాతీయ ఏఐ సదస్సు రెండో రోజు మంగళవారం ఉత్సాహభరితంగా కొనసాగింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్నాలజీ నిపుణులు, పాలసీ నిర్ణయాధికారులు, పరిశ్రమల ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొంటున్నారు. కృత్రిమ మేధస్సు భవిష్యత్తు దిశగా భారతదేశం తీసుకుంటున్న అడుగులపై విస్తృతంగా చర్చలు జరిగాయి. సదస్సును ఉద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేవలం సాంకేతిక ఆవిష్కరణ మాత్రమే కాదని, అది సామాన్య ప్రజల జీవనోపాధికి, సంక్షేమానికి తోడ్పడాల్సిన సాధనమని అన్నారు. "ఏఐ మనిషిని భర్తీ చేయడానికి కాదు, అతని సామర్థ్యాన్ని పెంచడానికి ఉపయోగపడాలి" అని ఆయన పేర్కొన్నారు.

**స్వదేశీ ఏఐ కళ్లద్దాల ఆవిష్కరణ**

ఈ సందర్భంగా భారత్‌లోనే అభివృద్ధి చేసిన 'సర్వం కాజే' అనే ఏఐ ఆధారిత వేరబుల్ పరికరాన్ని ప్రధాని స్వయంగా ధరించి పరిశీలించారు. సాధారణ కళ్లద్దాల్లా కనిపించే ఈ పరికరంలో ఆధునిక ఏఐ సాంకేతికత అమర్చబడింది. వినియోగదారులకు ప్రత్యక్ష సమాచారం, అనువాదం, డేటా విశ్లేషణ వంటి అనేక సౌకర్యాలు అందించేలా దీన్ని రూపకల్పన చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వచ్చే మే నెల నుంచి ఈ స్వదేశీ పరికరాలు మార్కెట్లోకి రానున్నాయని వెల్లడించారు.

**గ్లోబల్ ఏఐ హబ్‌గా భారత్ లక్ష్యం**

భారతదేశాన్ని గ్లోబల్ ఏఐ హబ్‌గా మార్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రాబోయే కాలంలో డేటా సెంటర్ల రంగంలో సుమారు 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. దీనివల్ల భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.విద్యా రంగంలో ఏఐ పాత్రపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు ఏఐ ఆధారిత విద్య అందించడం తమ ప్రాధాన్యత అని చెప్పారు. డిజిటల్ లెర్నింగ్, వ్యక్తిగతీకరించిన బోధన విధానాలు విద్యార్థులకు ఉపయోగపడతాయని వివరించారు.

**గ్రామీణ విద్యార్థులకు ఏఐ దోహదం**

శ్రీధర్ వెంబూ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఏఐ గొప్ప అవకాశమని అన్నారు. ఉపాధ్యాయులకు ఇది సహాయక సాధనంగా మారి బోధనను సులభతరం చేస్తుందని చెప్పారు. సరైన విధానాలు ఉంటే గ్రామీణపట్టణ మధ్య విద్యా అంతరాన్ని తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు.ఇదే సమయంలో నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ సమానత్వంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ అభివృద్ధిలో అన్ని దేశాలకు సమాన అవకాశాలు దక్కాలని, లేకపోతే అసమానతలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చాట్‌జీపీటీ వంటి ప్లాట్‌ఫారమ్‌లకు అమెరికా కంటే భారత్ 33 శాతం ఎక్కువ డేటా అందిస్తోందని గుర్తుచేశారు.ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోతామన్న భయాలు అవసరం లేదని అమితాబ్ కాంత్ పేర్కొన్నారు.కొత్త సాంకేతికతలు కొత్త రకాల ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని చెప్పారు. గ్లోబల్ సౌత్ దేశాలు కేవలం డేటా సరఫరాదారులుగానే మిగలకుండా, లాభాల్లో సమాన భాగస్వామ్యం పొందాలని ప్యానెల్ చర్చల్లో అభిప్రాయపడ్డారు.

**చిన్నారుల భద్రతపై చర్చలు**

సదస్సులో చిన్నారుల ఆన్‌లైన్ భద్రతపై ప్రత్యేక చర్చలు జరిగాయి. డిజిటల్ ప్రపంచంలో పిల్లల రక్షణ కోసం కఠిన చట్టాలు అవసరమని నిపుణులు సూచించారు. ఆరోగ్య రంగంలో ఏఐ విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదని, అయితే డిజిటల్ వ్యసనంపై అప్రమత్తంగా ఉండాలని వీకే పాల్ సూచించారు.

**ప్రపంచ నేతల హాజరు**

ఈ అంతర్జాతీయ సదస్సుకు విశేష స్పందన లభిస్తోంది. బిల్ గేట్స్ హాజరు కానున్నట్లు గేట్స్ ఫౌండేషన్ వెల్లడించగా, ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కూడా పాల్గొననున్నారు. సుమారు 20 దేశాల అధినేతలు, 60 మందికి పైగా మంత్రులు ఈ చర్చల్లో భాగమవుతున్నారు.మొత్తంగా భారత్ మండపంలో జరుగుతున్న ఈ ఏఐ మహాసభ దేశానికి సాంకేతిక రంగంలో కొత్త దిశను చూపిస్తోంది. ప్రజల సంక్షేమం, సమాన అభివృద్ధి, భద్రత అనే మూడు లక్ష్యాలతో భారత్ ఏఐ ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు ఈ సదస్సు స్పష్టం చేసింది.



# తాను జాతిపితనని కేసీఆర్ ఏనాడూ అనలేదు

**మొదటిపేజీ తరువాయి**

ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ జాతి గురించి అడుగుతున్నారని, కానీ తెలంగాణ మట్టితో మమేకమైన వారికి, ఉద్యమాల ఉగ్గుపాలు తాగిన వారికి, ఆత్మగౌరవ పోరాటంలో కలిసి నడిచిన వారికి మాత్రమే జాతి అంటే ఏమిటో తెలుస్తుందని అన్నారు. కానీ సమైక్యాంధ్ర సంచులు మోసిన వారికి జాతి గురించి ఏం తెలుస్తుందని అన్నారు.
ఇటీవల ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్‌ది ఏ జాతి, ఎవరికి జాతిపిత అంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో తెలంగాణ వాదుల జాతి, తెలంగాణ ద్రోహుల జాతులు ఉన్నాయని అన్నారు.
"సమైక్యాంధ్రవాదుల సంచులు మోసే సన్నాసులకు జాతి తెలియదు. నీతి తెలియదు. లాఠీ దెబ్బలు తిన్నవారికి, జైళ్లకు వెళ్లిన వారికి, తుపాకీలకు ఎదురొడ్డి నిలబడ్డ వారికి జాతి అంటే, జాతి అస్థిత్వం అంటే ఏమిటో తెలుసు. ఉద్యమకారుల పైకి తుపాకులు తీసుకెళ్లిన ద్రోహులకు జాతి నిర్వచనం ఎలా తెలుస్తుంది. రక్తంలో పౌరుషం ఉంటే, డీఎన్ఏలో ఉద్యమం ఉంటే ఆత్మాభిమానం అనేది ఎక్కడైనా నీ శరీరంలో ఉంటే నీకు జాతి అంటే ఏమిటో, జాతి చరిత్ర అంటే ఏమిటో తెలుస్తుంది. కానీ జై తెలంగాణ నినాదం ఇవ్వడానికే భయపడేవారికి, తెలంగాణ సోయిలేని సన్నాసులకు జాతి విలువ ఎన్నటికీ తెలియదు" అని కేటీఆర్ ధ్వజమెత్తారు.
"కొందరు అడుగుతున్నారు నీది ఏ జాతి అని. ఏ జాతికి జాతి పిత అని అడుగుతున్నారు. వారికి నేను సమాధానం చెబుతున్నాను. ఏ జాతి అనే అల్పుడికి నేను చెబుతున్నాను. రాజ్యతంత్రం నడిపిన రుద్రమ జాతి మాది. జల్ జంగల్ జమీన్ అని కొట్లాడిన కొమురంభీం, అస్తిత్వం కోసం అమరులైన సమ్మక్క, సారక్క,



కోటల మీద జెండా ఎగురవేసిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయిపాపన్న, భూస్వాముల దోపిడి మీద కొట్లాడిన దొడ్డి కొమురయ్య, బరిలో బందూకు పట్టి దేశ్‌ముఖ్‌లను తరిమికొట్టిన వీరనారి చాకలి ఐలమ్మ, సామాజిక విప్లవకారుడు భాగ్యరెడ్డి వర్మ, సిపాయిల తిరుగుబాటు బావుటా ఎగురవేసిన తుర్రెబాజ్ ఖాన్, ప్రాంతం వాడు మోసం చేస్తే ప్రాంతంలోనే ఉప్పుపాతర వేస్తామన్న కాళోజీ, నా తెలంగాణ కోటి రతనాల అన్న దాశరథీ, విద్యార్థి అమరవీరుల జాతి మాది" అని కేటీఆర్ ఉద్ఘాటించారు.

# ఇంకెంత కాలం ఈ అవమానాలు?

**మొదటిపేజీ తరువాయి**

భరించాలని వాపోయారు.
వలసవాదికి ఛైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టారని ఆరోపించారు. తాను మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి ఉన్నానని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థులుగా, స్వతంత్రులుగా ఎన్నికైన తన అనుచరులను ప్రజాభవన్‌కు తీసుకువెళ్లి కూడా చూపించానని తెలిపారు. పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడి పని చేసిన వారికి ఛైర్మన్ పదవి ఇవ్వాలని రాష్ట్ర నాయకులకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.
కానీ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన వారికే పదవులు కట్టబెట్టారని ఆరోపించారు. ఆయన మనుషులకు టిక్కెట్లు ఇవ్వడంతో పాటు మున్సిపల్ ఛైర్మన్ పదవి కూడా ఇవ్వడం దారుణమని అన్నారు. పార్టీ కోసం జగిత్యాల కాంగ్రెస్ కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని, కానీ మనం అధికారంలోకి వచ్చాక సొంత వారికి అన్యాయం జరగడం చాలా బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు న్యాయం చేయలేనప్పుడు తానేం చేయగలనని అన్నారు.



# తెలంగాణలో ప్రొపెల్లంట్ భారీ పెట్టుబడులు

**మొదటిపేజీ తరువాయి**

హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా ప్రారంభమైన బయో ఏసియా 2026 సదస్సు అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. ఈ పెట్టుబడులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదం చేయడమే కాకుండా స్థానికంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టిస్తాయని పేర్కొన్నారు.
బయో ఆసియా సదస్సుకు భారీ స్పందన
బయో ఆసియా-2026 సదస్సులో పారిశ్రామిక వేత్తలు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు, స్టార్టప్ వ్యవస్థాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని మంత్రి తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న ఈ సమయంలో భౌగోళిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలకు అనుగుణంగా సదస్సు విజన్ రూపొందించామని చెప్పారు. లైఫ్ సైన్సెస్ రంగంలోని కంపెనీలు ఏఐ ఆధారిత సాంకేతికతను వినియోగించుకుని ముందుకు సాగాలని సూచించారు. హెల్త్ కేర్ సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

**25 బిలియన్ డాలర్ల లక్ష్యం**

తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీ ప్రకారం 2035 నాటికి 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాలన్నదే టార్గెట్ అని మంత్రి వివరించారు. కొత్తగా లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ స్థాపనకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. హైదరాబాద్‌ను లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాలలో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతను రంగంలోకి తీసుకురావాలని నిర్ణయించామని చెప్పారు.

**జీనోమ్ వ్యాలీ విస్తరణ**

హైదరాబాద్ సమీపంలోని జీనోమ్ వ్యాలీ ఫేజ్-4ను 100 ఎకరాల్లో విస్తరించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కొత్త ఫేజ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఉత్పత్తి రంగంతో పాటు పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు.



**ఐదు లక్షల ఉద్యోగాల లక్ష్యం**

లైఫ్ సైన్సెస్ రంగంలో వచ్చే పెట్టుబడులతో కొత్తగా ఐదు లక్షల ఉద్యోగాలను సృష్టించే లక్ష్యంతో ఉన్నామని మంత్రి తెలిపారు. తెలంగాణను ప్రపంచంలోని టాప్-3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా నిలబెట్టాలని సంకల్పించామని చెప్పారు.
ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ, బయోటెక్నాలజీ, ఆధునిక ఔషధ పరిశోధన వంటి రంగాల్లో యువతకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం తెలంగాణ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి సంస్థల ద్వారా "రెడీ టు వర్క్" వర్క్ ఫోర్స్ తయారు చేస్తామని చెప్పారు.

**హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా**

సీబీఆర్ఐ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్-2025 నివేదిక ప్రకారం హైదరాబాద్ ఇప్పటికే గ్లోబల్ హబ్‌ల సరసన నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. ఔషధాల ఉత్పత్తి కేంద్రంగా మాత్రమే కాకుండా కొత్త మందుల పరిశోధనలో కూడా హైదరాబాద్ వేగంగా ఎదుగుతోందన్నారు.
మొత్తంగా బయో ఆసియా-2026 వేదికగా ప్రకటించిన కొత్త పెట్టుబడులు, ప్రణాళికలు తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగానికి కొత్త దిశను చూపిస్తున్నాయి. ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యాలు అమలైతే రాష్ట్రం గ్లోబల్ స్థాయిలో మరింత గుర్తింపు పొందే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# సీఎం చంద్రబాబుతో మంత్రి తుమ్మల భేటీ

- **ఏపీలో విలీన గ్రామల కోసం విజ్ఞప్తి**
- **రెండు రాష్ట్రాల సమస్యలపై చర్చ**
- **సరిహద్దుల్లో రోడ్ల తీరుపై సీఎం ఆరా**
- **సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే లైన్ల పూర్తికి నిర్ణయం**
- **తిరుమలలో తెలంగాణ భక్తలకు 5 ఎకరాలు**
- **భూ కేటాయింపునకు మంత్రి వినతి**

**ఆమరావతి, (ప్రజాస్వరం):**

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య సమన్వయం, సహకారంతో పరిష్కరించాల్సిన పలు అంశాలను భేటీలో ప్రస్తావించారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే లైన్లు వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా తెలుగు రాష్ట్రాల ప్రజలకు లబ్ది జరుగుతుందని తుమ్మల అభిప్రాయపడ్డారు. వీటికి సంబంధించిన పలు వివరాలను ముఖ్యమంత్రికి ఆయన తెలియచేశారు. రెండు ప్రభుత్వాలు ఉన్నత స్థాయిలో సంప్రదింపుల ద్వారా ఈ సమస్యల పరిష్కారం జరుగుతుందని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

**విలీన గ్రామాల విజ్ఞప్తి...**

రాష్ట్ర పునర్విభనలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం మండలానికి ఆనుకుని ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అయిదు గ్రామపంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తుమ్మల వివరించారు. యేటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామపంచాయతీలు భౌగోళికంగా తెలంగాణ ప్రాంతాల మధ్యలో ఉన్నాయన్నారు. ప్రజలు పరిపాలనా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు.
ఈ గ్రామాలు గోదావరి నది, అటవీ ప్రాంతాల మధ్య ఉండటంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంక్లేవ్‌లా మారిపోయాయని... జిల్లా కేంద్రాలకు చేరుకోవడానికి ప్రజలు దాదాపు 8 గంటలు ప్రయాణించాల్సి వస్తోందని మంత్రి పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, పన్నులు, పరిపాలనా అనుసంధానం లోపం, భద్రతా సమస్యలు వంటి అంశాలు స్థానిక గిరిజన ప్రజల జీవన విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయని వివరించారు.
భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయానికి సంబంధించిన భూభాగాల్లో కొంత భాగం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉండటం వల్ల దేవస్థానం పరిపాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సేవలు అందించాలంటే ఈ గ్రామాల విలీనం అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా ఈ చర్య కీలకమని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు సాగునీటి ప్రాజెక్ట్ శాశ్వత మరమ్మత్తులు అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మొత్తం 16,000 ఎకరాలకు సాగునీరు అందుతుండగా, అందులో సుమారు 13,640 ఎకరాలు (85.25%) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, 2,360 ఎకరాలు (14.75%) తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయి అని తెలిపారు. ప్రాజెక్ట్ శాశ్వత పునరుద్ధరణకు సుమారు రూ.92.20 కోట్ల వ్యయం అంచనా వేయబడిందన్నారు. రెండు రాష్ట్రాలకు లబ్ధి చేకూరుతున్న నేపథ్యంలో ఖర్చును 85:15 నిష్పత్తిలో భరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల కోరారు.
ఇటీవల ఆంధ్రప్రదేశ్ పరిధిలో గోదావరి వరద రక్షణ కరకట్టలోని 3వ స్లూయిస్ వద్ద గోడ దెబ్బతిన్న విషయం కూడా మంత్రి ప్రస్తావించారు. భద్రాచలం పట్టణాన్ని వరదల నుంచి రక్షించేందుకు నిర్మించిన ఈ రక్షణ గోడలో జరిగిన ఈ నష్టం భవిష్యత్తులో భారీ ప్రమాదానికి దారితీయొచ్చని పేర్కొన్నారు. కరకట్టలోని ఆ భాగం విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వెళ్లడంతో నిర్వహణలో సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు.ఖమ్మం పట్టణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి అవసరమైన భూమి గుర్తింపు పూర్తైందని మంత్రి తుమ్మల వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పనులు ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని మంత్రి కోరారు. స్థానిక భక్తుల దీర్ఘకాలిక ఆశయాన్ని నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.
తిరుమలలో తెలంగాణ భక్తుల కోసం ప్రత్యేక యాత్రికుల భవనం నిర్మాణానికి సుమారు 5 ఎకరాల భూమి కేటాయించాలని మంత్రి తుమ్మల ప్రతిపాదించారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో వసతి కొరతను తగ్గించి భక్తులకు సౌకర్యవంతమైన దర్శన అనుభవం కల్పించేందుకు ఈ ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందని తెలిపారు.సత్తుపల్లి కొవ్వూరు రైల్వే లైన్, పెనుబల్లి అమరావతి రైల్వే లైన్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.





## పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు : పంపిణీ

**జగదేవ్ పూర్, ఫిబ్రవరి17, (ప్రజాస్వరం)**

జగదేవ్ పూర్ మండలం వట్టిపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మంగళవారం మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా బీ ఆర్ఎస్ గ్రామ యువ అధ్యక్షులు ఎండి జానీ పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందించారు.అనంతరం బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు భుమా విజయ్ కుమార్ మాట్లాడుతూ..పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులతో అందరు విద్యార్థులు ఉత్తీర్ణతో గ్రామాన్ని మంచి పేరును తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగరాజు,వార్డ్ నెంబర్లు శ్రీకాంత్,శ్రీకాంత్ ,రమేష్ నరహరి, వెంకటేష్ ,షాదుల్లా,హెచ్ఎం సరోజ,ఉపాధ్యా బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**జగదేవ్ పూర్ ,ఫిబ్రవరి17, (ప్రజాస్వరం)**

జగదేవపూర్ మండలం ఇటిక్యాల ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ దీన రాజలింగం ,మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ గుప్తా ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. అలాగే పిల్లలకు కార్పొట్స్ అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ... కేసీఆర్ ను తెలంగాణ అభివృద్ధిలో మార్పు చూపిన ఉద్యమ నాయకుడిగా, రైతులకు రైతుబంధుతో అండగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రిగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు యాదగిరి, స్వామి, యువకులు నవీన్, బిట్టు, అశోక్, అనిల్ ,ప్రవీణ్, భాను, హేమంత్, ఐలయ్య, పర్వతాలు, గణేష్, ,తదితరులు పాల్గొన్నారు.



## తూప్రాన్ లో కెసిఆర్ 72 వ జన్మదిన సంబురాలు....

**తూప్రాన్ ఫిబ్రవరి 17( ప్రజా స్వరం )**


తూప్రాన్ మున్సిపల్ నూతన చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో కేసీఆర్ 72వ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ రజని రవీందర్ గౌడ్ మాట్లాడుతూ..కేసీఆర్ తెలంగాణ ప్రధాత కాళేశ్వర నిర్మాత త్రాగునీటి దాత అభివృద్ధి వారధి సంక్షేమ సారథి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ప్రతిరూపం తెలంగాణ ప్రగతికి దారిదీపం ఎన్ని ఆటుపోట్లు వచ్చినా వెరువని గుండె ధైర్యం ప్రజల కోసం ఎందాకైనా కొట్లాడే తెలంగాణ నాయకుడి కల్వకుంట్ల చంద్రునికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు .... సంపూర్ణ ఆరోగ్యంతో చీకట్లను చీల్చుకుంటూ పూర్ణ చంద్రుని వెలుగులా తన ఖ్యాతి దశదిశలా వ్యాపించాలని ఆమె కోరారు ...... తెలంగాణ జాతి పిత, తెలంగాణ తొలి ముఖ్య మంత్రి గౌరవ కేసీఆర్ జన్మదినం సందర్భంగా తూప్రాన్ మున్సిపాలిటీ లొ ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించిన గౌరవ తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ శ్రీమతి బొంది రజిని రవీందర్ గౌడ్ . ఈ కార్యక్రమం లొ పాల్గొన్న వైస్ చైర్మన్ శ్రీమతి కొక్కొండ సమత కాశిరెడ్డి, కౌన్సిలర్లు సత్యలింగం, ఐలేష్ యాదవ్, రాధిక శ్రీనివాస్, చెలిమేల రాములు, జైపాల్ రాథోడ్, మునిరాతి లక్ష్మి మల్లేష్ మరియు మండల పార్టీ అధ్యక్షులు బాబుల్ రెడ్డి, యూత్ అధ్యక్షులు శ్రీకాంత్, మైనారిటీ లీడర్ సత్తార్ బాయ్, బుక్క విజయ్ కుమార్, ప్రవీణ్ కుమార్,ఏర్పల బాల్ రాజ్,బాబు రామ్ ప్రసాద్,కోటేష్,నర్సింగరావు,నాగేందర్ రెడ్డి,ఆంజనేయులు,నర్సింహ రెడ్డి,శాస నాగేందర్, సముద్రాల బాబు,శ్రవణ్,భాను మరియు బి. అర్. ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కేసీఆర్ జన్మదిన వేడుకలు.....

**తూప్రాన్ ఫిబ్రవరి 17 (ప్రజా స్వరం )**

తూప్రాన్ మండలం లోని మల్కాపూర్ లో తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 72 వ జన్మదిన సందర్భంగా మల్కాపూర్ లో కేసీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి కేక్ కటింగ్ చేసి స్విట్లు పంపిణీ చేసిన సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతు.. తెలంగాణ యోధుడు జాతీయ పీత కేసీఆర్ మరో రెండేళ్ల లో తెలంగాణ రాష్ట్ర లో బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం మరో సారి ముఖ్యమంత్రి గా సేవలు అవసరం ఉందని ఆయన అన్నారు తెలంగాణ అభివృద్ధి చెందాలంటే మళ్ళీ కేసీఆర్ తోనే సాధ్యం అని ఆంజనేయులు గౌడ్ అన్నారు



# ఘనంగా కెసిఆర్ పుట్టినరోజు వేడుకలు..

**రామయంపేట, ఫిబ్రవరి 17 ( ప్రజా స్వరం )**



రామాయంపేట మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ జాతిపిత కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం పార్టీ కార్యాలయం నుండి ఇటీవల గెలిచిన కౌన్సిలర్లతో కలిసి బీఆర్ఎస్ నాయకులు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పుర వీధుల గుండా ఈ విజయోత్సవ బైక్ ర్యాలీ కొనసాగింది. అనంతరం సిద్దిపేట చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 72వ జన్మదిన సందర్భంగా భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. సందర్భంగా ఏర్పాటు చేస్తున్న సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చౌదరి సుప్రభాత్ రావు మాట్లాడుతూ ఇటీవల గెలిచిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అభివృద్ధి చేయకుంటే మున్సిపాలిటీలో ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు. రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు, రామాయంపేట మున్సిపాలిటీలో ఎలాంటి అవినీతి జరిగిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రాబోవు రోజుల్లో జరిగే జడ్పిటిసి ఎంపిటిసి స్థానాల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్ మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కడ లేని విధంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ బీఆర్ఎస్ పార్టీ గెలుపొందడం ఖాయమని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు చౌదరి చరిత, మద్దెల మాధవి, ప్రవీణ్, బిఆర్ఎస్ యూత్ నాయకులు ఉమామహేశ్వర్, ఎస్కే హైమద్, శ్రీకాంత్ సాగర్ పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తా..

- ఐదు ప్రాంతాల్లో మినీ వాటర్ ట్యాంకులకు శంకుస్థాపన..
- సర్పంచ్ వెంకు గారి ఉమా సంజీవరెడ్డి..

**రామాయంపేట, ఫిబ్రవరి 17. ( ప్రజాస్వరం )**



మెదక్ జిల్లా రామాయంపేట మండలం లోని ఆర్.వెంకటాపూర్ గ్రామంలో మినీ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి గ్రామ సర్పంచ్ వెంకు గారి ఉమా సంజీవరెడ్డి సోమవారం నాడు శంకుస్థాపన చేశారు. గ్రామం లోని రామాలయం ముందు, ఎస్సి కాలనీ, ఎస్సి స్మశాన వాటిక ముందు, మాల వాడకు, హిందూ స్మశానవాటిక, పిట్టల వాడలో మీని వాటర్ ట్యాంక్ లను నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గ్రామ సర్పంచ్ ఉమా సంజీవరెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజల సహాయ సహకారాలతో ముందుకు వెళ్తానని తెలిపారు. రాజకీయాలకు తాను కొత్తగా వచ్చినా, అభివృద్ధి విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తి లేదని ఆమె స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు తాను గ్రామ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటివి దశల వారిగా పూర్తి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. అందరూ బాగుండాలి, గ్రామ సంక్షేమానికి అందరూ సూచనలు ఇవ్వాలని తెలిపారు. గ్రామంలో ఐదు ప్రాంతాల్లో మినీ వాటర్ ట్యాంకులను కట్టిస్తున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధి నీ కొంతమంది కావాలని అడ్డుకుంటే వారిని గ్రామ ప్రజలు చూసుకుంటారని తెలిపారు. జిల్లాలోనే ఆర్.వెంకటాపూర్ గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామపంచాయతీగా తీర్చి దిద్దడానికి తానవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానని వెంకు ఉమా సంజీవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనురాధ నరేష్, వార్డు సభ్యులు గట్టయ్య, స్వామి, ఎల్లం ,నాగరాణి గ్రామస్తులు సంజీవరెడ్డి, సీద్దరాం రెడ్డి ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రైనీ గ్రూప్1 అధికారుల ఫీల్డ్ విజిట్

**మాసాయిపేట ఫిబ్రవరి 18 ప్రజాస్వరం**

మండలం కేంద్రంలోని రామంతపూర్ గ్రామంలో ట్రైనీ గ్రూప్1 అధికారులు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో బస చేసి, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారని సర్పంచ్ సంధ్య భవాని తెలిపారు. అధికారుల పర్యటన నిమిత్తం గ్రామంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ ఫీల్డ్ వర్క్ కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొని అధికారులకు స్థానిక అంశాలపై అవగాహన కల్పించనున్నారు.




## ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు...

**చిన్న శంకరంపేట ఫిబ్రవరి 17 ( ప్రజాస్వరం)**

చిన్న శంకరంపేట మండలకేంద్రంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ సంబరాలలో మునిగితేలారు ఈ సందర్భంగా టిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజు చిన్న శంకర్ మాజీ సర్పంచ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 14 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం జరిగిందని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందడం జరిగిందని రైతులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని ధనికల రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు అప్పుల పాలయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండున్నర సంవత్సరాలలోపే తెలంగాణ రాష్ట్రం పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయిందని వారు మండిపడ్డారు తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ కెసిఆర్ రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని కెసిఆర్ తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నమ్మకం ప్రజల్లో ఎక్కువైందని రాబోయే రోజుల్లో మళ్లీ కెసిఆర్ సీఎం కావడం ఖాయమని వారు అన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు, చిన్న శంకరంపేట సొసైటీ మాజీ చైర్మన్ అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఏమ వెంకటేశం, లక్ష్మారెడ్డి, యాదగిరి యాదవ్, శ్రీనివాస్, ఏమ చంద్రం, స్వామి రాజ్, ప్రభాకర్, గంగమ్మ, నవీన్, చంద్రయ్య, యాదగిరి, రమేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు,



## చాత్తాద శ్రీవైష్ణవ సంఘం తూప్రాన్ డివిజన్ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక...

**తూప్రాన్ ఫిబ్రవరి 17( ప్రజా స్వరం )**

తూప్రాన్ డివిజన్ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షులుగా శ్రీ చోర్డం విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా కంటయపాలెం వేణుగోపాల్ లను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.. ఉపాధ్యక్షులుగా పేర్లలక్ష్మణ్,కెనవ్యశ్రీ,సాంప్రదాయ కార్యదర్శిగాఅహోబిలంశ్రీనివాస్,ఆర్థికకార్యదర్శిగా నందగిరి రాఘవేంద్ర స్వామి సహాయ కార్యదర్శిగా అహోబిలం సుధాకర్, ముఖ్య సలహాదారులుగా.. డాక్టర్ ప్రదీప్ సింహ అహోబిలం హరిప్రసాద్ బోయిన్పల్లి విష్ణువర్ధన్ పేర్ల మధుసూదన్ తిరునగరి రామ్ కుమార్ టి విజయ్ కుమార్ అహోబిలం ప్రవీణ్ టిశ్రీధర్ కుమార్..లను వాష్టకార్యవర్గంఏకగ్రీవంగా నియమించబడినది.



## ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

- కేసీఆర్ కారణజన్ముడు- సర్పంచ్ కనకరాజు, వైస్ ఎంపీపీ కడపల బాల్ రెడ్డి

**గజ్వేల్, వర్గల్ ఫిబ్రవరి 17 (ప్రజాస్వరం):**





తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కారణ జన్ముడు అని గౌరారం సర్పంచ్ కనకరాజు గౌడ్, వైస్ ఎంపీపీ కడపల బాల్ రెడ్డి అన్నారు. మంగళవారం వర్గల్ మండల గౌరారం కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వారి జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది అని అందులో భాగంగా మండల కేంద్రంలో గౌరారం లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగిందని రాబోయే కాలంలో మళ్ళీ తెలంగాణ రాష్ట్రానికి కెసిఆర్ సీఎం కావాలని కోరుకోవడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో , మాజీ ఎంపీపీ లత రమేష్ గౌడ్ ,సీనియర్ నాయకులు భూరెడ్డి మధుసూదనరెడ్డి, నారెడ్డి మహిపాల్ రెడ్డి, భూరెడ్డి విష్ణువర్ధనరెడ్డి, నారెడ్డి లక్ష్మరెడ్డి,డి భాస్కర్, బి దేవేందర్ రెడ్డి,పీ రాజు గౌడ్,శేఖర్,నందు, చంద్ర రెడ్డి, చంద్రం, భాస్కర్, పీ కృష్ణ గౌడ్, డి అశోక్, ఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు



# కేసీఆర్ జన్మదిన వేడుకలు

**మాసాయిపేట ఫిబ్రవరి 18 ప్రజాస్వరం**

మండల కేంద్రంలో నాగుసాన్ పల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మంతూరి ఆంజనేయులు ఉపసర్పంచ్ సందీప్ కుమార్ వెంకటేష్ బాబు పవన్ రాజశేఖర పాల సిద్దిరాములు కిషన్ సిద్ధిరాములు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సంత్ సేవాలాల్ ప్రీమియర్ లీగ్ పోటీలు

**మాసాయిపేట ఫిబ్రవరి 18 (ప్రజాస్వరం)**

మండలం కేంద్రంలోని చెట్ల తిమ్మాయ పల్లి నడిమి తండాలో సంత్ సేవాలాల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. సర్పంచ్ కేతావత్ రాము నాయక్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. మాలోత్ గణేష్ నాయక్ జట్టు ప్రథమ స్థానం నిలువగా, హలవత్ మహేందర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. పోటీల్లో విజయం సాధించిన జట్లను అభినందించారు



# కొనాయిపల్లి పీటీలో

**మనోహరాబాద్17(ప్రజా స్వరం): :**

మనోహరాబాద్ మండలం కొనాయ పల్లి పీటి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో టపాకాయలు పేల్చి, కేక్ కట్ చేసుకుని, ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. రానున్న కాలంలో వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వము అంటూ బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ప్రతి గ్రామ గ్రామాన బీఆర్ఎస్ హయంలోని అభివృద్ధి చెందాయని,కాంగ్రెస్ ప్రభుత్వంలో హామీలు పేరుకు మాత్రమే ఉన్నాయని నెరవేర్చడం లేదని తెలిపారు. తెలంగాణను తిరిగి రాసేది మల్లి కేసీఆర్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బక్క సురేష్,సత్యనారాయణ, సంతోష్ రమేష్, ప్రభాస్, బాబు, చిన్న, మహిపాల్. శ్రీను. సతీష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# కలెక్టర్ కు జైలు శిక్ష హైకోర్టు తీర్పు...

**మెదక్ డెస్క్ (ప్రజా స్వరం )**

మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాల లో భూమి కేసులో లక్ష్మి అనే మహిళా వేసిన కేసులో కలెక్టర్ నిర్లక్ష్యంగా వ్యవరించడం తో హైకోర్టు తీర్పు కోర్టు ధిక్కరణ కేసులో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు జైలుశిక్ష పడింది. ఉద్దేశపూర్వకంగా కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని పేర్కొంటూ ఆయనకు హైకోర్టు ఆరు నెలల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. అనంతరం తీర్పు అమలును నాలుగు వారాలపాటు నిలిపివేసింది. అప్పీలు చేసుకునేందుకు కలెక్టర్‌కు నాలుగు వారాల గడువు ఇచ్చింది. ఒక భూవివాదం కేసులో గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను కలెక్టర్ పాటించుకోలేదని ఆరోపిస్తూ మెదక్ జిల్లా బోనల గ్రామానికి చెందిన లక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది.



# గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా హైదరాబాద్

**మొదటిపేజీ తరువాయి**

ఏఐలో అగ్రస్థానానికి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.సభలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, “హైదరాబాద్ అంటే ఒకప్పుడు చార్మినార్, బిర్యానీ, ఫార్మా, సాఫ్ట్‌వేర్ గుర్తొచ్చేవి. కానీ ఇప్పుడు ఈ నగరం గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మారుతోంది” అన్నారు.నాణ్యమైన విద్యా సంస్థలు,నైపుణ్యంతో కూడిన యువశక్తి,బలమైన పరిశ్రమల వాతావరణం హైదరాబాద్‌ను సామర్థ్యవంతమైన కేంద్రంగా తీర్చిదిద్దాయని చెప్పారు.

**వేగంగా ఎదుగుతున్న ఏఐ రంగం**

గత రెండు సంవత్సరాల్లోనే ఏఐ రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చినట్లు సీఎం వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పారదర్శక విధానాలు, వేగవంతమైన అనుమతుల ప్రక్రియ, పరిశ్రమలకు అనుకూల వాతావరణం కారణంగానే ఇది సాధ్యమైందని చెప్పారు.కొద్ది వారాల క్రితం దావోస్‌లో నిర్వహించిన ప్రపంచ ఆర్థిక వేదికలో తెలంగాణ కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించామని గుర్తుచేశారు. జీనోమ్ వ్యాలీ విస్తరణ, ప్రపంచ స్థాయి పరిశోధన కోసం “వన్‌బయో” ప్రారంభం, గ్రీన్ ఫార్మా సిటీ వేగవంతం వంటి చర్యలతో రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు. అనేక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను రాష్ట్రానికి ఆహ్వానించామని తెలిపారు.

**బయోఏషియా**

**బయో వరల్డ్‌గా మారుతోంది**

ఈ అభివృద్ధి సాధారణం కాదని, దీని వెనుక దృఢమైన దృష్టి ఉందని సీఎం పేర్కొన్నారు. ఆ దృష్టికి ప్రత్యక్ష సాక్ష్యమే బయోఏషియా-2026 అని అన్నారు. “ఈ సభను చూస్తుంటే గర్వంగా ఉంది. బయోఏషియా ఇప్పుడు తన పేరును దాటి బయోవరల్డ్‌గా మారుతోంది” అని చెప్పారు.ఈ ఏడాది సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా 500 ప్రముఖ సంస్థలకు చెందిన 4,000 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారని వివరించారు. ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, ఆరోగ్య రంగాల ప్రముఖులు, వ్యాపార నాయకులు, శాస్త్రవేత్తలు ఈ వేదికపై కలుసుకోవడం విశేషమన్నారు. సైన్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), బయోటెక్నాలజీ రంగాల సమన్వయంతో అసాధారణ ఫలితాలు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు.

**దావోస్ స్థాయి గుర్తింపు లక్ష్యం**

హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ సదస్సు భవిష్యత్తులో దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం స్థాయి అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందనే నమ్మకం ఉందని సీఎం తెలిపారు. తెలంగాణను జీవవిజ్ఞాన రంగంలో గ్లోబల్ మ్యాప్‌పై నిలబెట్టడం తమ లక్ష్యమన్నారు.2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు. ఈ దిశగా పరిశోధనా సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, స్టార్టప్‌లు, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరమని అన్నారు.

**పెట్టుబడులకు ఆహ్వానం**

“మీరు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు దృష్టితో కూడిన వాతావరణాన్ని కోరుకుంటున్నారు. తెలంగాణ అలాంటి వేదికను అందిస్తుంది. దీనికి సమాధానం హైదరాబాద్” అని సీఎం పేర్కొన్నారు. బల్క్ డ్రగ్స్ నుంచి బయాలజిక్స్ వరకు, తయారీ నుంచి ఆవిష్కరణ వరకు తెలంగాణ ముందంజలో ఉందన్నారు. భారత దేశంలోనే కాకుండా ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతున్నామని తెలిపారు.హైదరాబాద్ ఇప్పటికే గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు ప్రాధాన్య గమ్యస్థానంగా మారిందని, ఇప్పుడు దీన్ని సమగ్ర జీవవిజ్ఞాన రంగానికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన సమయం వచ్చిందన్నారు.



**కలిసి పనిచేద్దాం – సీఎం పిలుపు**

సదస్సుకు హాజరైన పరిశ్రమల ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించారు. “ఇక్కడ పెట్టుబడులు పెట్టండి. మీ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను స్థాపించండి. ఆవిష్కరణ కేంద్రాలను నిర్మించండి. మాలిక్యూల్స్ రూపకల్పన చేయండి. కొత్త ఔషధాలను అభివృద్ధి చేయండి. క్లినికల్ అనలిటిక్స్ నిర్వహించండి. ఏఐ ప్లాట్‌ఫారమ్‌లను అభివృద్ధి చేయండి. డిజిటల్ తయారీని ముందుకు తీసుకెళ్లండి” అని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు, శాస్త్రవేత్తలు, నైపుణ్యంతో కూడిన యువత పెట్టుబడిదారుల విజయానికి భాగస్వాములవుతారని హామీ ఇచ్చారు. ఇప్పటికే హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా గుర్తింపు పొందిందని, ఇకపై ప్రపంచ జీవవిజ్ఞాన రాజధానిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. “ప్రపంచానికి తెలంగాణ సిద్ధంగా ఉంది. తెలంగాణ అంటే వ్యాపారం. తెలంగాణ ఎదుగుతోంది. ఈ అభివృద్ధి ప్రయాణంలో మీరు కూడా భాగస్వాములు కండి” అంటూ సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగాన్ని ముగించారు.బయోఏషియా-2026 సదస్సు రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు, కొత్త భాగస్వామ్యాలు, కొత్త అవకాశాలను తెరుస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. హైదరాబాద్ మరోసారి అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను చాటుకుంది.





# ఘనంగా పోచమ్మ తల్లికి బోనాలు....

**చిన్న శంకరంపేట ఫిబ్రవరి 17 ( ప్రజాస్వరం)**

చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా నేడు మూడవరోజు గ్రామదేవతలకు కోణాల ఊరేగింపు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ కంజర్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, ఉత్సవాలకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు మైనంపల్లి హనుమంతరావు సతీమణి వాణి హాజరై సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఉత్సవాలకు హాజరైన మైనంపల్లి వానికి ఆలయ పూజారి ప్రసాద్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు, అనంతరం ఆమె బోనం ఎత్తుకొని ఉత్సవాలలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఉత్సవాలకు హాజరైన మైనంపల్లి వాణిని స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ రాజిరెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించారు, ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా స్థానిక ఎస్సై నారాయణ గౌడ్ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు, పోతరాజుల విన్యాసాలు సూపర్లను ఎంతగానో ఆకట్టుకున్నాయి, అమ్మవారి అలంకరణ వేషాధారణ రంగురంగుల విద్యుత్తు వెలుగులు డీజే సౌండు యువకుల నృత్యాలు కేరింతల మధ్య ఉత్సవాలు ఘనంగా కొనసాగాయి, ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సోమేశ్వర స్వామి దేవాలయం 55 వార్షికోత్సవ వేడుకలు నాలుగు రోజుల పాటు నిర్వహించుకోవడం జరుగుతుందని నేడు మూడవరోజు ఉదయం అగ్నిగుండాల దాటడం,గ్రామదేవతలకు బోణాల కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ఈనెల 18వ తేదీన స్వామి వారి కళ్యాణం, రథోత్సవం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు స్వామివారి కృపా కటాక్షాలు ఈ ప్రాంత ప్రజలతోపాటు పరిసర ప్రాంత ప్రజలపై ఉండాలని ప్రజలంతా సుఖ సంతోషా ఉండాలని ఆయన స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ సర్పంచ్ చంద్రశేఖర్, సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు గోపాల్ రెడ్డి, కామారం సర్పంచ్ గడ్డం సుజాత, చిన్న శంకరంపేట ఉప సర్పంచ్ భాను ప్రసాద్, కామారం ఉపసర్పంచ్ గడీల సుధాకర్, మాజీ ఎంపీటీసీ రాధిక కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ లు శ్రీమాన్ రెడ్డి, రామకృష్ణయ్య, కుమార్ గౌడ్, హేమలత సుధాకర్, యాదగిరి యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సానా సత్యనారాయణ, యాదవరావు, రాజాసింగ్, చిరంజీవి, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు,











## మల్లన్న స్వామి జాతరలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, పామేన భీమ్ భరత్

**షాబాద్,ఫిబ్రవరి 17(ప్రజాస్వరం):**

షాబాద్ మండలంలోని లింగారెడ్డిగూడెం గ్రామంలో జరుగుతున్న మహాశివరాత్రి పండుగలో భాగంగా మల్లన్న స్వామి జాతరలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ ఎలగంటి మధుసూదన్ రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ భీమ్ భారత్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.ప్రజలందరూ దైవ చింతన అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం జరిగిన బండ లాగుడు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్పంచులు సుధాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,కుమ్మరి చెన్నయ్య, యాదయ్య, అశోక్,సందీప్,మాజీ సర్పంచ్ జనార్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుభాష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,జహంగీర్,విష్ణువర్ధన్ రెడ్డి ,నర్సింలు గౌడ్, కిషోర్,రఫీక్,లింగం,మల్లారెడ్డి, వెంకట్ రెడ్డి,తదితరులు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొనడం జరిగింది.



# జర్నలిస్టుల సమస్యలకు చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కృషి చేయాలి

- **టీయూడబ్ల్యూజే-ఐజేయు జిల్లా అధ్యక్షులు సలీం.**
- **జర్నలిస్టుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాను. జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ మధుసూదన్ రెడ్డి.**

**షాబాద్,ఫిబ్రవరి 17 (ప్రజాస్వరం):**

ప్రతినిత్యము ఒక జర్నలిస్టు ఏదో ఒక సమస్యతో ఆసుపత్రిలో చేరడం అనారోగ్యంతో వివిధ రకాల ఇబ్బందులతో సతమతమవ్వడం జరుగుతున్నదని దానికి కారణం అతనికి వృత్తిపరంగా ఉన్న ఇబ్బందులే కారణమని టి యు డబ్ల్యూజేఐజేయు జిల్లా అధ్యక్షులు సలీం అన్నారు. షాబాద్ మండలానికి చెందిన ఆంధ్రప్రభ రిపోర్టర్ విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన కాదుమూరి రాములు సంతాప సభకు ఆయన హోప్ ఫౌండేషన్ అధ్యక్షులు కొండ విజయ్ తో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. వత్తిడీల కారణంగా అనారోగ్యాలకు విలేకరులు గురవుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విలేకరులు నిరుపేదలని అందరి సమస్యలను సమాజానికి తెలియజేసే వారు సమస్యలకు గురైతే ఎవరు దిక్కు అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆరోగ్య శ్రీ తప్ప ఎలాంటి పథకాలను విలేకరులకు ఇవ్వడం లేదని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి ఎన్నిసార్లు తమ సమస్యలను తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా విలేకరుల ఆరోగ్యం కొరకు ఆరోగ్య భద్రత పథకాన్ని అమలు చేయాలని బీమా ప్రభుత్వమే చెల్లించి పేద విలేకరులను ఆదుకోవాలని అన్నారు. అలాగే విలేకరుల పిల్లల ఉన్నత చదువులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాములు కుటుంబానికి ఎల్లవేళలా సపోర్టుగా ఉంటామని తెలిపారు. షాబాద్ మండల జర్నలిస్టుల సంఘం తరపున రాములు కుటుంబానికి సహాయం చేయడం చాలా సంతోషకరమైన విషయమని ఆయన కొనియాడారు జిల్లా వ్యాప్తంగా ఏ విలేకరికి ఇబ్బంది వస్తే ఇలాంటి కార్యక్రమాలు చేసి వారి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని అన్నారు. ఆంధ్రప్రభ యాజమాన్యం రిపోర్టర్లు కలిసి రాములు కుటుంబానికి చేసిన ఆర్థిక సహాయాన్ని అలాగే షాబాద్ మండలం రిపోర్టర్ల సంఘం అందరి సహకారంతో రాములు కుటుంబానికి 8 లక్షల రూపాయల అందజేయడం సంతోషకరమైన విషయం అన్నారు.

**విలేకరుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాను. జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ మధుసూదన్ రెడ్డి.**

గ్రామీణ ప్రాంతాల్లోని విలేకరులు పడుతున్న ఇబ్బందులను తాను స్వయంగా చూశానని ప్రస్తుతం చూస్తున్నానని జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి తెలిపారు. రాములు సంతాప సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... విలేకరుల సమస్యలను వారి ఆరోగ్య భద్రత విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పేద విలేకరులు పడే కష్టాలు చాలా ఉన్నాయని తెలిపారు. పేద విలేకరులకు ఆరోగ్య భద్రత, భీమా విషయమై ఆ శాఖ మంత్రికి వెంటనే తెలియజేస్తానని తెలిపారు. అవసరమైతే షాబాద్ మండలంలో ఆ శాఖ మంత్రితో ఒక కార్యక్రమం ఏర్పాటు చేసి హామీ ఇప్పిస్తానని విలేకరులకు హామీ ఇచ్చారు. అందరి కష్టాలను సమాజానికి తెలియజేస్తూ తమ కష్టాలను దిగమింగి బాధ కడుపులో ఉంచుకునే వ్యక్తి విలేకరి అని తెలిపారు. చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీమ్ భరత్ మాట్లాడుతూ విలేకరి అంటే కర్పూరం లాంటివాడని తెలిపారు తాను అందరికి వెలుగునిస్తూ తాను కాలిపోతూ ఉంటాడని తెలిపారు. రాములు మృదుస్వభావి అని ఆయన చేసిన సేవలను గురించి ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం నాయకులు యాదయ్య,రామచంద్రయ్య,వివిధ పార్టీల నాయకులు పీసరి సురేందర్ రెడ్డి,కావలి చంద్రశేఖర్, షాబాద్ సర్పంచ్ గుండాల అశోక్,వివిధ గ్రామాల సర్పంచ్ లు,మద్దూర్ మల్లేష్,మద్దూరు పాండు,మానయ్య, శ్రీశైలం,ఉపాధ్యాయ సంఘాల నాయకులు,సీఐ కాంతారెడ్డి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై స్టే

**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 17(ప్రజాస్వరం):**




రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ దాదాపు పూర్తయిన తరుణంలో హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులతో ఎన్నికల కమిషన్ ఈ ఎన్నికను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి అదృశ్యం కావడమే ఈ ఎన్నిక వాయిదా కు కారణంగా తెలుస్తోంది. తన తండ్రిని ఎవరో కిడ్నాప్ చేశారని యాదగిరి కుమారుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటి షన్ దాఖలు చేశారు. యాదగిరిని గురువారం తమ ముందు హాజరుపరచాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. అప్పటి వరకు చైర్మన్ ఎన్నికపై స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఒకవైపు కోర్టులో విచారణ జరుగుతుండగానే ఇబ్రహీంపట్నం కౌన్సిల్‌లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. బిఆర్ఎస్‌కి చెందిన టేకుల సుదర్శన్ రెడ్డిని 15 మంది కౌన్సిలర్లు చైర్మన్‌గా ఎన్నుకున్నా రు. వైస్ చైర్మన్ ఎన్నిక శుక్రవారానికి వాయిదా పడింది. ఈ క్రమంలో కిడ్నాప్ అయ్యారని భావించిన కౌన్సిలర్ యాదగిరి ఎన్నిక ప్రక్రియ ముగిసిన వెంటనే అనూహ్యం గా కౌన్సిల్ హాల్లో ప్రత్యక్షమయ్యారు. సరిగ్గా చైర్మన్ పేరును అధికారికంగా ప్రకటించాల్సిన సమయంలో హైకోర్టు స్టే ఉత్తర్వులు అందడంతో అధి కారులు ఇబ్రహీంపట్నం ఎన్నికను నిలిపివేశారు. స్టే కారణంగా బిఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థికి ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదు.

## అష్టదిగ్బంధంలో తొర్రూరు, జనగామ

**మహబూబాబాద్ ఫిబ్రవరి 17(ప్రజాస్వరం):**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సోమవారం ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో వాయిదా పడ్డ తొర్రూరు, జనగామ మున్సిపాలిటీ చైర్ పర్సన్, వైస్ చైర్పర్సన్ ఎన్నికలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. సోమవారం అటు అధికార కాంగ్రెస్ ఇటు ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు హోరాహోరీగా తలపడడంతో పాటు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించడంతో శాంతి భద్రతల పరిస్థితుల నేపథ్యంలో మంగళవారం ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీలో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, జనగామ లో డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో ఇరుచోట్ల వెయ్యి మందికి పైగా పోలీసుల బందోబస్తుతో ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఉదయం పోలీసులతో ఆయా పట్టణాల్లో కవాతు నిర్వహించి, తొర్రూరు, జనగామ పట్టణాలను పోలీసులు అష్టదిగ్బంధం చేశారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి అన్ని చర్యలు చేపట్టారు. 11:30 ప్రాంతంలో ఐయా మున్సిపాలిటీల్లో నిర్వహించే ఎన్నికలకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు భారీ బందోబస్తు మధ్య మున్సిపాలిటీ కార్యాలయాలకు చేరుకున్నారు. మరికొద్ది సేపట్లో అధికారులు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఇరు మున్సిపాలిటీల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ కు సమాన ఓట్లు రావడంతో ఉత్కంఠ నెలకొంది.






## ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**శంకర్ పల్లి ఫిబ్రవరి 17(ప్రజాస్వరం):**

బిఆర్ఎస్ బుల్కపూర్ 4వ వార్డు కౌన్సిలర్ మద్దురి శేఖర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తెలంగాణ నిర్మాణ శిల్పి, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చెంద్రశేఖర రావు జన్మదిన వేడుకలు బుల్కపూర్ గ్రామంలో మంగళవారం అత్యంత ఘనంగా ఫ్లెక్సీలతో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొని కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా మద్ధురి శేఖర్ మాట్లాడుతూ..." సింహ గర్జనతో ఢిల్లీ పీఠాన్ని కదిలించి, కోటి రాతనలా వీణను మీటిన పోరాట యోధుడు కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన వీరుడు ఆయన నీటి వాటా కోసం, నిధుల వేట కోసం నినాదించి కాళేశ్వరం వంటి ప్రాజెక్టులతో పచ్చని పంటలు పండించిన ఆపర భగీరథడు మన కేసీఆర్ తెలంగాణ కలను సాకారం చేసిన దేవుడు ఆయన అని కొనియాడారు.

## డ్రైనేజీ నిర్మించారు.. పైకప్పు మరిచారు

**శంకర్ పల్లి ఫిబ్రవరి 17(ప్రజాస్వరం):**

శంకర్ పల్లి మున్సిపల్ లోని 8వ వార్డు నిర్మించిన డ్రైనేజీ పనులకు సంవత్సరం కాలం పూర్తికావస్తున్నా, ఇప్పటికీ పైకప్పు (స్లాబ్) నిర్మాణం చేపట్టకపోవడం స్థానికుల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. డ్రైనేజీ నిర్మాణం చేపట్టి పైకప్పు వదిలేయడంతో ఆయా ప్రాంతాల ప్రజలు రోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ పైకప్పు లేకపోవడంతో మురుగునీటి దుర్వాసన వ్యాపించడమే కాకుండా, దోమలు పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు రాకపోకల్లో ప్రమాదానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే డ్రైనేజీ నిర్మాణం పూర్తయినప్పటికీ, పైకప్పు నిర్మాణం ఎందుకు చేపట్టలేదన్న దానిపై మున్సిపల్ అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిధుల లేమా? నిర్లక్ష్యమా? లేక పాలకుల ఆసక్తి లోపమా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తమ ఇబ్బందులు వివరించాలని 8వ వార్డు ప్రజలు చర్చించుకుంటున్నారు. డ్రైనేజీ పైకప్పు పనులు వెంటనే చేపట్టి, ప్రజలకు నిత్య సమస్యగా మారిన ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు మున్సిపాలిటీ అధికారులను, ప్రజాప్రతినిధులను డిమాండ్ చేస్తున్నారు.



## శభాష్ యాదన్నసీఎం రేవంత్ రెడ్డి

**చేవెళ్ల ఫ్రిబవరి 17(ప్రజాస్వరం):**

శభాష్ యాదన్న అంటూ చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని చేవెళ్ల, శంకర్ పల్లి, మొయినాబాద్ మునిసిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను చైర్ పర్సన్లు గా ఎన్నుకోవడం పట్ల ప్రత్యేకంగా ఎమ్మెల్యే యాదయ్య ను ప్రత్యేకంగా అభినందించి మూడు మున్సిపాలిటీలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు.




## ఉగాది నాటికి సిద్ధం కానున్న సనత్‌నగర్ టిమ్స్.. మంత్రి సమీక్ష

**సనత్‌నగర్, ఫిబ్రవరి 17(ప్రజాస్వరం):**



సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్ పనులను పర్యవేక్షించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మెడికల్, ఫైర్, పొల్యూషన్ కంట్రోల్, వాటర్, ఎలక్ట్రిసిటీ, ఆర్ అండ్ బీ తదితర శాఖల ఉనతాధికారులతో టిమ్స్ ఎమర్జెన్సీ బ్లాక్‌లో మంత్రి సమీక్ష. ఉగాది నాటికి అన్ని సౌకర్యాలతో హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి. హాస్పిటల్‌కు నీళ్లు, పవర్ సప్లైలో ఎలాంటి ఆటంకం ఉండకూడదని, 24 గంటల సరఫరా ఉండాలని సూచన ఫైర్ సేఫ్టీ విషయంలో రాజీ ఉండకూడదని, అన్ని ఫ్లోర్లలో పూర్తిస్థాయి పరిశీలన చేయాలి. అగ్నిమాపకశాఖ అధికారులను ఆదేశించిన మంత్రి.. రిసెప్షన్ ఏరియా, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, ఓపీ కన్సల్టేషన్ రూమ్స్, డయాగ్నస్టిక్స్, ఇన్ పేషెంట్ వార్డులు, ఫార్మసీ తదితర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి.. పేషెంట్ల సంఖ్యకు అనుగుణంగా ఓపీ, ఫార్మసీ కౌంటర్లు ఉండాలని అధికారులకు సూచించిన మంత్రి.సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, ఆల్ట్రాసౌండ్ తదితర యంత్రాలను పరిశీలించిన మంత్రి.. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యంత్రాలు పూర్తిస్థాయిలో పేషెంట్లకు ఉపయోగపడాలి. ఇందుకు అవసరమైన డాక్టర్లు, ఇతర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఉగాది నాటికి అన్ని సౌకర్యాలతో అన్ని హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని మంత్రి సూచించారు. ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ , ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి, వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు జేఎండీ మయాంక్ మిట్టల్, డీఎంఈ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.





# హస్తానికి కలిసొచ్చిన లక్కీ డ్రాలు

**మొదటిపేజీ తరువాయి**

తొర్రూరు మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక ఉత్కంఠకు తెరపడింది. భారీ హైడ్రామా, ఉద్రిక్తతల నడుమ జరిగిన ఈ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. కాంగ్రెస్ కౌన్సిలర్ తూనం శ్రవణ్ లాటరీ పద్ధతిలో చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మున్సిపల్ చైర్మన్ పదవి కోసం నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. ఇరు పార్టీలకు సమానంగా ఓట్లు రావడంతో గెలుపు ఎవరిని వరిస్తుందో అన్న ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో అధికారులు నిబంధనల ప్రకారం లాటరీ పద్ధతిని అనుసరించారు. లాటరీ తీయగా, అదృష్టం కాంగ్రెస్ అభ్యర్థి తూనం శ్రవణ్‌ను వరించింది. దీంతో అధికారులు ఆయన్ను మున్సిపల్ చైర్మన్‌గా ప్రకటించారు. బీఆర్ఎస్ కంచుకోటగా భావించే ఈ ప్రాంతంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, ఈ ఎన్నిక సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద భారీగా మోహరించిన కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరగడంతో గందరగోళం నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఎట్టకేలకు ఫలితం వెలువడటంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నారు.

**ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక**

వివిధ కారణాలతో వాయిదా పడ్డా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక మంగళవారం కూడా అత్యంత రసవత్తరంగా సాగింది. ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటింగ్ ప్రక్రియ ను ప్రారంభించిన అధికారులు.. చేతులెత్తి చైర్మన్‌ను ఎన్నుకోవాలని సూచించారు. అయితే, దీనికి కాంగ్రెస్ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, రహస్యంగా ఓటింగ్ నిర్వహించాలని గొడవకు దిగారు. మరోవైపు, ఎన్నికల నియమావళి ప్రకారమే ఓటింగ్ జరగాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు పట్టుబట్టడంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఉద్రిక్తత పెరిగి కాంగ్రెస్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ కౌన్సిలర్లపై దాడులకు దిగారు. మున్సిపల్ కార్యాలయం వద్ద తోపులాట జరగడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఇరు పార్టీల మధ్య ఘర్షణలు జరుగుతున్నప్పటికీ, రిటర్నింగ్ అధికారి పట్టుదలతో ఓటింగ్ ప్రక్రియను కొనసాగించారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల ప్రక్రియ పూర్తి చేశారు. చివరికి ఉద్రిక్త పరిస్థితుల నడుమే జరిగిన ఓటింగ్‌లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకోగా.. 3వ వార్డు మెంబర్ టేకుల సుదర్శన్ రెడ్డి 15 ఓట్లతో మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్ ఎన్నిక శుక్రవారానికి వాయిదా వేశారు. ఎన్నికల ఫలితాల్లో హంగ్ ఏర్పడిన పరిస్థితుల్లో కూడా వ్యూహాత్మకంగా వ్యవహరించి బీఆర్ఎస్ ఈ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం.ఇల్లెందు మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. అక్కడ చైర్మన్‌గా దొడ్డ కిరణ్‌మిత్ర, వైస్ చైర్మన్‌గా పెండేల రాజు ఎన్నికయ్యారు. ఇబ్రహీపట్నం మున్సిపాలిటీని బీఆర్ఎస్ దక్కించుకుంది. మున్సిపల్ చైర్మన్‌గా టేకు సుదర్శన్‌రెడ్డి ఎన్నియ్యారు. అక్కడ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. ఇంద్రేశం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఛైర్‌పర్సన్‌గా కె.ప్రమీల, వైస్ ఛైర్మన్‌గా హరీశ్‌రెడ్డి ఎన్నికయ్యారు.

అంతకుముందు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. రహస్య ఓటింగ్ కోసం కాంగ్రెస్.. నిబంధనల ప్రకారమే ఎన్నిక నిర్వహించాలని బీఆర్ఎస్ పట్టుబట్టాయి. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య జరిగిన వాగ్వాదం దాడులకు దారితీసింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. టేకుల సుదర్శన్‌రెడ్డి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. అయితే కోర్టు స్టే ఉత్తర్వుల కారణంగా వైస్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. ఛైర్మన్‌కు ధ్రువపత్రం ఇవ్వడంపై అధికారులు కోర్టు ఉత్తర్వులు అందిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దీనిపై కాంగ్రెస్ శ్రేణులు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.

**ఇంద్రేశం బీఆర్ఎస్ ఖాతాలో**

సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. మొత్తం 18 వార్డులున్న ఈ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 4, బీజేపీ 2, స్వతంత్రులు 1 స్థానాలు గెలుచుకున్నారు. స్వతంత్ర సభ్యుడి మద్దతుతో బీఆర్ఎస్ ఆధిక్యం సాధించింది. ఛైర్‌పర్సన్‌గా ప్రమీల, వైస్ ఛైర్మన్‌గా హరీశ్ రెడ్డి ఎన్నికయ్యారు. పఠాన్‌చెరు పరిధిలోని గడ్డపోతారం, గుమ్మడిదల, జిన్నారం, ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీలను కూడా బీఆర్ఎస్ దక్కించుకోవడం గమనార్హం.

**జనగామలో లక్కీ డ్రా**

జనగామ మున్సిపాలిటీలో ఉత్కంఠ నెలకొంది. 30 వార్డులున్న ఈ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ 13, కాంగ్రెస్ 12, ఇతరులు 5 స్థానాలు గెలుచుకున్నారు. ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిపి మేజిక్ ఫిగర్ 17 కాగా, రెండు పార్టీలకు 16 మంది సభ్యుల చొప్పున మద్దతు లభించింది. దీంతో లక్కీ డ్రా నిర్వహించగా, కాంగ్రెస్ అభ్యర్థి బాలమణికి అదృష్టం వరించింది. వైస్ ఛైర్మన్‌గా బీఆర్ఎస్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థి పర్వతాలు ఎన్నికయ్యారు.

**సుల్తానాబాద్, జహీరాబాద్‌లో కాంగ్రెస్ విజయాలు**

సుల్తానాబాద్ మున్సిపాలిటీని కాంగ్రెస్ దక్కించుకుంది. ఛైర్మన్‌గా బిరుదు కృష్ణ, వైస్ ఛైర్‌పర్సన్‌గా పుష్పలత ఎన్నికయ్యారు. జహీరాబాద్‌లో ముగ్గురు స్వతంత్రులు, ఇద్దరు ఎంఐఎం సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ విజయం సాధించింది. యూనుస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఎంపీ సురేష్ షెట్కార్ ఓటు వేశారు.

**కాగజ్‌నగర్‌లో కాంగ్రెస్‌కు మద్ధతు**

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లింది. బీజేపీ మద్దతుతో కాంగ్రెస్ ఛైర్‌పర్సన్‌గా షాహిన్ సుల్తానా ఎన్నికయ్యారు.

**క్యాతన్‌పల్లి, ఖానాపూర్‌లో వాయిదా**

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఎన్నిక వాయిదా పడింది. ప్రత్యేకాధికారి సతీష్ కుమార్ ఎన్నిక నిలిపివేశారు. బీఆర్ఎస్ (10), సీపీఐ (4) సభ్యులు ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. మంత్రి వివేక్, ఎంపీ వంశీ పార్టీ అభ్యర్థులతో కలిసి బయటకు వెళ్లిన ఘటన చర్చనీయాంశమైంది. ఖానాపూర్‌లో కోరం లేక ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే బొజ్జు హాజరైనా, బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు గైర్హాజరయ్యారు.

**ఎన్నికల కోడ్ ఎత్తివేత**

రాష్ట్ర ఎన్నికల సంఘం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో ఎన్నికల ప్రక్రియ పూర్తయినట్లు ప్రకటించింది. దీంతో ఎన్నికల కోడ్‌ను ఎత్తివేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదినితో బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు ఫోన్‌లో మాట్లాడి కొన్ని చోట్ల ఎన్నికలు యథావిధిగా కొనసాగించాలని కోరినట్లు సమాచారం.ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. దీంతో ఆ జిల్లాలో కాంగ్రెస్ బలంగా నిలిచింది. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పీఠాల కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోటీ కనిపించింది. కొన్ని చోట్ల లక్కీ డ్రా ద్వారా ఫలితాలు రావడం ఉత్కంఠ రేపింది. మరికొన్ని మున్సిపాలిటీల్లో కోర్టు స్టేలు, కోరం సమస్యలతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# నాలుగు వారాల్లో లొంగిపోవాలి

- ప్రత్యూష కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- రెండు దశాబ్దాలుగా సంచలనంగా మారిన కేసు
- గుడిపల్లి సిద్దార్థ రెడ్డి అప్పీల్‌ను కొట్టేసిన సుప్రీం
- హైకోర్టు ఖరారు చేసిన శిక్షను సమర్థించిన ధర్మాసనం
- పోస్టుమార్టం నిర్వహణ తీరుపై సుప్రీం అసంతృప్తి



రెండు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా కొనసాగుతున్న సినీనటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కేసులో నిందితుడిగా ఉన్న గుడిపల్లి సిద్ధార్థరెడ్డి దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేస్తూ, హైకోర్టు ఖరారు చేసిన శిక్షను అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. దీంతో సుదీర్ఘ న్యాయపోరాటానికి ముగింపు పలుకుతూ, నిందితుడు నాలుగు వారాల లోపు లొంగిపోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాగే కేసు దర్యాప్తు, ముఖ్యంగా పోస్టుమార్టం నిర్వహణ తీరుపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హంగా మారింది.

**సంచలనం సృష్టించిన ప్రత్యూష మృతి**

2000ల ప్రారంభంలో తెలుగు సినీ పరిశ్రమలో ఎదుగుతున్న యువ నటి ప్రత్యూష ఆకస్మిక మరణం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. సినీరంగంలో అవకాశాలు పెరుగుతున్న సమయంలో ఆమె అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం అనేక అనుమానాలకు తావిచ్చింది. మొదట ఈ ఘటన ఆత్మహత్యా? లేక ఇతర కారణాలున్నాయా? అనే కోణాల్లో విస్తృత చర్చ జరిగింది. మీడియా, సినీ వర్గాలు, ప్రజల మధ్య తీవ్ర ఆసక్తి నెలకొనడంతో కేసు విచారణకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

**ప్రేమ నుంచి విషాదాంతం వరకు**

దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, ప్రత్యూష సిద్ధార్థరెడ్డి హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారింది. చదువు పూర్తయ్యాక ఇద్దరూ వేర్వేరు మార్గాలు ఎంచుకున్నారు. ప్రత్యూష సినీరంగంలోకి అడుగుపెట్టి అవకాశాలు అందుకుంటుండగా, సిద్ధార్థరెడ్డి ఇంజినీరింగ్ విద్యను కొనసాగించాడు. అయినప్పటికీ వారి మధ్య సంబంధం కొనసాగినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి.

2002 ఫిబ్రవరి 23న సాయంత్రం 7.30 నుంచి 8 గంటల మధ్య ఇద్దరూ విషం తాగిన పరిస్థితిలో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించబడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ప్రత్యూష ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఫిబ్రవరి 24న ఆమె మృతి చెందింది. సిద్ధార్థరెడ్డి మాత్రం చికిత్స అనంతరం కోలుకుని మార్చి 9న ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు.

**విషప్రయోగం ఎలా జరిగింది?**

వైద్య పరీక్షలు, ఫోరెన్సిక్ విశ్లేషణల్లో ఇద్దరూ కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలిపి తాగినట్లు నిర్ధారణకు వచ్చింది. ఆర్గానోఫాస్ఫేట్ అనే విష పదార్థం ప్రభావంతో ప్రత్యూష మరణించినట్లు నిపుణులు వెల్లడించారు. ఈ ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవడంతో రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు వైద్యులతో ప్రత్యేక వైద్యబృందాన్ని ఏర్పాటు చేసింది.

ఆ బృందం సమగ్రంగా పరిశీలించి సమర్పించిన నివేదికలో, ప్రత్యూష మరణానికి ఊపిరాడకుండా చేయడం, లేదా మరణానికి ముందు లైంగిక దాడి జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. విషప్రయోగమే మరణానికి ప్రధాన కారణమని పేర్కొంది. ఈ నివేదిక కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా మారింది.

**సీబీఐ దర్యాప్తు, కేసు నమోదు**

ఘటన తీవ్రత దృష్ట్యా కేసును సీబీఐకి అప్పగించారు. అందుబాటులో ఉన్న సాక్ష్యాలు, వైద్య నివేదికలు, సాక్షుల వాంగ్మూలాలు పరిశీలించిన సీబీఐ అధికారులు సిద్ధార్థరెడ్డిపై భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) 306వ సెక్షన్ (ఆత్మహత్యకు పురికొల్పడం), 309వ సెక్షన్ (ఆత్మహత్యాయత్నం) కింద అభియోగాలు మోపుతూ ఛార్జిషీట్ దాఖలు చేశారు. దర్యాప్తులో ఇద్దరూ కలిసి విషం సేవించినప్పటికీ, ఘటనకు దారితీసిన పరిస్థితుల్లో సిద్ధార్థరెడ్డి పాత్ర ఉన్నట్లు సీబీఐ పేర్కొంది. దీంతో కేసు న్యాయపరమైన విచారణ దశలోకి ప్రవేశించింది.

**సెషన్స్ కోర్టు తీర్పు**

కేసును విచారించిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు 2004 ఫిబ్రవరి 23న కీలక తీర్పు వెలువరించింది. నిందితుడు సిద్ధార్థరెడ్డి దోషిగా తేలినట్లు పేర్కొంటూ ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. అదనంగా రూ.5 వేల జరిమానా కూడా విధించింది. ఈ తీర్పుతో కేసు మరోసారి వార్తల్లో నిలిచింది.

**హైకోర్టులో ఉపశమనం**

సెషన్స్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ సిద్ధార్థరెడ్డి హైకోర్టును ఆశ్రయించాడు. కేసును పునర్విచారించిన హైకోర్టు 2011 డిసెంబరు 28న తీర్పు ఇచ్చింది. జైలుశిక్షను ఐదేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గిస్తూ, జరిమానాను రూ.5 వేల నుంచి రూ.50 వేలకు పెంచింది. శిక్షలో మార్పులు చేసినప్పటికీ, నిందితుడి దోషిత్వాన్ని హైకోర్టు కొనసాగించింది.

**సుప్రీంకోర్టులో అప్పీలు**

హైకోర్టు తీర్పుపై అసంతృప్తితో సిద్ధార్థరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. మరోవైపు ప్రత్యూష తల్లి సరోజినీదేవి కూడా కేసులో పూర్తి న్యాయం జరగలేదని భావిస్తూ వేరుగా అప్పీల్ దాఖలు చేశారు. 2012లో దాఖలైన ఈ అప్పీలు సుదీర్ఘ కాలం పాటు వివిధ దశల్లో విచారణకు వచ్చాయి. ఇటీవల ఈ కేసుపై సుప్రీంకోర్టు విస్తృతంగా వాదనలు విని తీర్పును రిజర్వ్ చేసింది. కేసులో దర్యాప్తు విధానం, వైద్య ఆధారాలు, న్యాయపరమైన అంశాలు అన్నింటినీ సమగ్రంగా పరిశీలించిన అనంతరం తుది తీర్పును ప్రకటించింది.

**సుప్రీంకోర్టు తుది తీర్పు**

మంగళవారం వెలువడిన తీర్పులో సుప్రీంకోర్టు హైకోర్టు విధించిన శిక్షను సమర్థించింది. సిద్ధార్థరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ, విధించిన శిక్ష అమల్లో కొనసాగుతుందని స్పష్టం చేసింది. అలాగే నిందితుడు నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. ఇక కేసులో పోస్టుమార్టం నిర్వహించిన తీరుపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. పోస్టుమార్టం ప్రక్రియలో అవసరమైన ప్రమాణాలు పూర్తిగా పాటించలేదని వ్యాఖ్యానించింది. ఇటువంటి కీలక కేసుల్లో వైద్యపరమైన విచారణ అత్యంత జాగ్రత్తగా జరగాల్సిన అవసరం ఉందని సూచించింది.

**రెండు దశాబ్దాల న్యాయపోరాటానికి ముగింపు**

సుమారు 24 సంవత్సరాలుగా సాగుతున్న ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. ప్రారంభంలో అనుమానాస్పద మృతి, అనంతరం దర్యాప్తు, కోర్టు విచారణలు, అప్పీలు ఇలా వివిధ దశలను దాటి చివరకు సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరంగా ముగింపు దశకు చేరుకుంది. ఈ తీర్పుతో అప్పట్లో తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన ప్రత్యూష మృతి కేసుకు తుది అధ్యాయం ముగిసినట్లయింది. న్యాయ ప్రక్రియ ఎంత సుదీర్ఘమైనదైనా, చివరకు చట్టపరమైన నిర్ణయం వెలువడుతుందనే అంశాన్ని ఈ కేసు మరోసారి గుర్తుచేసిందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ప్రత్యూష మరణం సినీరంగాన్ని కలచివేసిన సంఘటనగా నిలిచిపోయింది. యువ వయసులోనే ఆమె జీవితం విషాదాంతం కావడం, ఆ ఘటన చుట్టూ నెలకొన్న వివాదాలు, అనంతర న్యాయపోరాటం తెలుగు రాష్ట్రాల క్రిమినల్ న్యాయచరిత్రలో ప్రత్యేకంగా నిలిచే కేసుగా మారింది.

# ఎప్‌స్టీన్ ఫైల్స్ దుమారం

- ఏఐ సదస్సుకు బిల్‌గేట్స్ దూరం
- ఢిల్లీలో జరుగుతున్న శిఖరాగ్ర సదస్సు
- బిల్ గేట్స్‌కు ఆహ్వానం రాలేదంటూ చర్చ
- కథనాల నేపథ్యంలో ప్రభుత్వ పునరాలోచన
- గేట్స్ ఫౌండేషన్ కీలక వివరణ

దేశ రాజధాని ఢిల్లీలో కృత్రిమ మేధ (ఏఐ)పై అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ శాస్త్రవేత్తలు, టెక్నాలజీ నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు ఈ సమ్మిట్‌లో పాల్గొంటున్నారు. అయితే ఈ సదస్సులో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ పేరు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**ఇండియాలో ఉన్నా ఆహ్వానం లేదట**

ప్రస్తుతం బిల్ గేట్స్ భారత్ పర్యటనలో ఉన్నారు. రెండు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. అయినప్పటికీ ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు ఆయనకు ఆహ్వానం అందలేదని సమాచారం. ముఖ్య స్పీకర్ల జాబితాలో ఆయన పేరు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

**ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రభావమా?**

ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ఇటీవల వెలుగులోకి వచ్చిన 'ఎప్‌స్టీన్ ఫైల్స్' నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికా ఫైనాన్షియర్ మరియు బాలలపై లైంగిక నేరాలకు దోషిగా ఆరోపణలు ఎదుర్కొన్న జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన కొన్ని క్లాసిఫైడ్ డాక్యుమెంట్లను అమెరికా ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఆ ఫైల్స్‌లో బిల్ గేట్స్ పేరు కూడా ప్రస్తావనలో ఉన్నట్లు విదేశీ మీడియా కథనాలు వెల్లడించాయి.ఆ ఆరోపణల నేపథ్యంలో సమ్మిట్ ఆహ్వానంపై ప్రభుత్వం పునరాలోచన చేసి, గేట్స్‌కు ఆహ్వానం పంపకూడదని నిర్ణయించినట్లు సమాచారం. బాధితుల పక్షాన నిలబడాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వ వర్గాలు చెప్పినట్లు ఒక మీడియా కథనం పేర్కొంది.



**ఆరోపణలు, క్షమాపణలు**

ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బిల్ గేట్స్‌పై కొన్ని ఆరోపణలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. వివాహేతర సంబంధాలు, విదేశీ మహిళలతో పరిచయాలు వంటి విషయాలు అందులో ఉన్నాయని అమెరికన్ మీడియా రిపోర్టులు పేర్కొన్నాయి. అయితే ఈ ఆరోపణలపై గేట్స్ ఇప్పటికే స్పందించారు. ఎప్‌స్టీన్‌తో సంబంధాలు పెట్టుకోవడం పొరపాటేనని, ఆ పరిచయాన్ని తాను పశ్చాత్తాపంగా చూస్తున్నానని ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ ఘటనల పట్ల క్షమాపణలు కోరుతున్నట్లు వెల్లడించారు.

ఎప్‌స్టీన్ 2019లో న్యూయార్క్ జైలులో మరణించిన విషయం తెలిసిందే. ఆయన కేసు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పలువురు రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రముఖుల పేర్లు కూడా అప్పట్లో చర్చకు వచ్చాయి. భారత కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పురి పేరు కూడా ఆ ఫైల్స్‌లో ప్రస్తావనలో ఉన్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

ఇదిలా ఉండగా ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సమ్మిట్‌లో కృత్రిమ మేధ భవిష్యత్తు, డేటా భద్రత, నియంత్రణ విధానాలు, నైతిక ప్రమాణాలు వంటి అంశాలపై విస్తృత చర్చలు జరుగుతున్నాయి. భారత్‌ను గ్లోబల్ ఏఐ హబ్‌గా తీర్చిదిద్దడమే ఈ సదస్సు ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు.బిల్ గేట్స్‌కు ఆహ్వానం అందలేదన్న వార్తలపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడకపోయినా, ఈ అంశం రాజకీయ, సాంకేతిక వర్గాల్లో చర్చకు దారితీసింది. ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రభావమేనా లేదా వేరే కారణాలున్నాయా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఢిల్లీలో జరుగుతున్న ఈ అంతర్జాతీయ ఏఐ శిఖరాగ్ర సదస్సు ఒకవైపు సాంకేతిక భవిష్యత్తుపై దృష్టి సారిస్తుండగా, మరోవైపు బిల్ గేట్స్ ఆహ్వానం అంశం వివాదాస్పదంగా మారింది. ముందస్తుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గురువారం సమ్మిట్ లో బిల్ గేట్స్ పాల్గొనాల్సి ఉంది. కానీ ఇవాళ సమ్మిట్ లో పాల్గొనే ముఖ్యుల జాబితాలో ఆయన పేరు కనిపించలేదు. దీంతో ఆయన ఈ సమ్మిట్ కు దూరంగా ఉన్నారనే ప్రచారం జరిగింది. లైంగిక వేధింపుల నేరగాడు జెఫ్రీ ఎప్ స్టీన్ తో బిల్ గేట్స్ స్నేహం, ఇటీవల విడుదలైన ఎప్ స్టీన్ ఫైల్స్‌లో గేట్స్ పేరు వెలుగులోవచ్చింది. దీంతో ఆయనపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఎఫెక్టు వల్లే ఈ సమ్మిట్‌కు దూరంగా ఉండాలనే నిర్ణయించుకున్నారనే ప్రచారం జరుగుతోంది. జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో గేట్స్ ఫౌండేషన్ క్లారిటీ ఇచ్చింది. బిల్ గేట్స్ తన షెడ్యూల్ ప్రకారం ఏఐ సమ్మిట్‌కు హాజరవుతారని ఆయన ప్రసంగిస్తారని గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి ఓ న్యూస్ ఏజెన్సీకి వివరణ ఇచ్చారు. బిల్ గేట్స్ హాజరుపై వస్తున్న విమర్శలను ఆయన ఖండించారు. కాగా బిల్ గేట్స్ గురువారం ఇండియా సమ్మిట్‌లో కీలక ప్రసంగం చేయనున్నారు.

# బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం ప్రాణం తీసింది

- ఈసీఐఎల్‌లో విషాదం

**కుషాయిగూడ,ఫిబ్రవరి 17 (ప్రజాస్వరం):**

కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈసీఐఎల్ బస్టాప్ వద్ద జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శుభోదయం కాలనీకి చెందిన చిట్యాల లక్ష్మి (64) మంగళవారం మధ్యాహ్నం తన పనులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు ఈసీఐఎల్ బస్టాప్ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ సమయంలో ఈసీఐఎల్ నుంచి ఘట్కేసర్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు (నెం. TS03Z0324, రూట్ నెం. 281) ఎక్కే క్రమంలో డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని కదిలించడంతో ఆమె స్టెప్స్ నుంచి జారి కిందపడి పోయారు. వెంటనే బస్సు టైర్లు ఆమె పాదాలపైకి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి.

సమాచారం అందుకున్న ఆమె కుమారుడు చిట్యాల నరసింహ సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన తల్లిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా, ఈ ఘటనపై కుషాయిగూడ డిపో మేనేజర్ వేణుగోపాల్ స్పందిస్తూ, ప్రమాదానికి కారణమైన బస్ డ్రైవర్‌ను పర్మినెంట్‌గా ఉద్యోగం నుండి తొలగించినట్లు తెలిపారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999